క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా సహస్రనామార్చన



అప్పన్నకు సహస్రనామార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఉదయం సహస్రనామార్చన విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేప చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 1001 నామాలతో స్వామికి సహస్రనామార్చన నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదాన్ని అందజేశారు.

22న 'ఆదర్శ్'లో మెగా జాబ్ మేళా

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఇ.ఫ్లోరా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 నుంచి ప్రారంభం కానున్న మేళాలో 14 కంపెనీల్లో కొలువులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ(ఆఖరు సంవత్సరం విద్యార్థులు అర్హులే), ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 91549 38472 నెంబర్లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

శ్రమశక్తినగర్‌లో బస్ షెల్టర్ ప్రారంభం



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వసంత, కాలనీ ప్రతినిధులు

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని శ్రమశక్తినగర్‌లో కాలనీ వెల్ఫేర్ నిధులతో నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను కార్పొరేటర్ శానాపతి వసంత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. కాలనీ అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని మాటిచ్చారు. స్థానిక నాయకుడు శానాపతి శంకర్రావు, కాలనీ ప్రతినిధులు వాసం వెంకటేశ్వరరావు, చిన్నాజీ, రమణమూర్తి, శంకరప్రసాద్, జనార్దనరావు, గజపతి, జగన్నాథస్వామి, హరి, ధర్మరాజు, శ్రీకాంత్, శంకర్రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న స్కిల్ హబ్‌లో హ్యాండ్ ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 3 నెలల పాటు జరిగే ఈ శిక్షణ కోసం 8వ తరగతి చదివి 18–45 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు అర్హులన్నారు. ఇందుకు గురువారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99669 65502 నెంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యం



మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: గతేడాది నవంబర్‌లో అదృశ్యమైన పెందుర్తి ప్రాంతానికి చెందిన ఓ మహిళ(39) ఆచూకీని పోలీసులు బుధవారం కనుగొన్నారు. పెందుర్తి ప్రాంతానికి చెందిన మహిళ నవంబర్ 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. దాదాపు మూడు నెలల తరువాత నగరంలో ఆమె సంచారాన్ని గుర్తించిన పోలీసులు బుధవారం పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



కీర్తన

పెందుర్తి: పురుషోత్తపురం ప్రాంతానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు బుధవారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పురుషోత్తపురం మహతి పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న తోట రాధ కుమార్తె కీర్తన(21–వివాహిత, భర్త మరణించాడు) ఈ నెల 17న రాత్రి 10.30 సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె తల్లి రాధ పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ బి.అప్పారావు దర్యాప్తు చేస్తున్నారు.

శీఘ్ర బస్సు రవాణా వ్యవస్థ(బీఆర్‌టీఎస్) పేరులో తప్ప.. ప్రయాణంలో శీఘ్రత మచ్చుకైనా కానరాదు. పెందుర్తి ట్రాన్సిట్ కారిడార్(పీటీసీ)కు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, రోడ్లు ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారాలు.. బస్సులకు మాత్రమే పరిమితం కావాల్సిన మధ్య రోడ్డులో ఇతర వాహనాల రాకపోకలు.. దీంతో బీఆర్‌టీఎస్ పెందుర్తి కారిడార్ ట్రాఫిక్ ఇక్కట్లకు, ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.



బీఆర్‌టీఎస్ రహదారి మధ్య రోడ్డులో యథేచ్ఛగా తిరుగుతున్న బైక్‌లు, కార్లు

బెంబేలెత్తిస్తున్న BRTS



- నిబంధనలకు తిలోదకాలు.. ఇష్టానుసారంగా ప్రయాణాలు
- పెందుర్తి నుంచి ఎన్‌ఏడీ వరకు ఇదే తీరు
- చక్రవ్యూహంగా మారిన మూడు రోడ్లు
- ఓ వైపు ప్రమాదాలు, మరోవైపు ట్రాఫిక్ ఇక్కట్లు

ఇలా చేస్తే మేలు..

- బీఆర్‌టీఎస్ రహదారి ఆక్రమణలను పూర్తిగా తొలగించాలి. ముఖ్యంగా ఫుట్‌పాత్, రోడ్డును ఆక్రమించి జరుగుతున్న వ్యాపారాలను నిరోధించాలి. వీరికి ప్రత్యేక హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలి.
- ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నళ్లు, సిబ్బందిని క్రమం తప్పకుండా పెట్టాలి.
- మధ్య రోడ్డులో బస్‌లు, అత్యవసర వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలి. ముఖ్యంగా రాంగ్‌రూట్ ప్రయాణాలు నిరోధించాలి. ఆర్టీసీ డ్రైవర్లకు నిబంధనలపై తగిన శిక్షణ ఇవ్వాలి.

పెందుర్తి:

అధికారుల నిర్లిప్తత, వాహన చోదకుల నిర్లక్ష్యం వెరసి బీఆర్‌టీఎస్ కారిడార్లో తరచూ ప్రమాదాలకు, ట్రాఫిక్ ఇక్కట్లకు కారణమవుతున్నాయి. బస్సులు, అంబులెన్స్‌ల రాకపోకలకు మాత్రమే పరిమితం కావాల్సిన మధ్య రోడ్డులో ఇతర వాహనాల ప్రవేశంతో అత్యధికంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాల నియంత్రణకు ఈ మధ్య కాలంలో ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న చర్యలు కాస్త ఉపశమనం కలిగిస్తున్నా.. పూర్తి స్థాయి నియంత్రణ మాత్రం సాధ్యం కావట్లేదు.

తాత్కాలిక ఆక్రమణలతో ఇబ్బందులు

బీఆర్‌టీఎస్ రహదారి రాకముందు అనేక మంది చిరు వ్యాపారులు రోడ్డును అనుకునే వ్యాపారాలు చేసేవారు. పెందుర్తి కూడలి మొదలుకుని వేపగుంట, నాయుడుతోట, గోపాలపట్నం, బాజీ జంక్షన్, ఎన్‌ఏడీ జంక్షన్ ప్రాంతాల్లో చాలామందికి ఈ రోడ్డే ఉపాధి మార్గం. బీఆర్‌టీఎస్ రాకతో సీన్ మారిపోయింది. ఎక్కడపడితే అక్కడ వ్యాపారాలు నిర్వహించే అవకాశం లేకుండా పోయింది. బస్సుల కోసం మధ్య లైన్ కేటాయించగా మరో రెండు లైన్లలో ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆయా లైన్లలో తోపుడు బళ్లు, ఇతర వ్యాపారాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వీరికి హాకర్స్ జోన్ ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డును వదల్లేని పరిస్థితి. వీటితో పాటు వాహన సర్వీసింగ్ సెంటర్లు, దుకాణాలకు వచ్చిన వాహనాల పార్కింగ్ కూడా రోడ్డుపైనే. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ ఇక్కట్లు నెలకొంటున్నాయి.



పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద బీఆర్‌టీఎస్ రహదారిపై ఓ లైన్‌లో అనధికారికంగా పార్కింగ్ చేసిన వాహనాలు

రాంగ్ రూట్ ప్రయాణాలు

మరోవైపు ఈ రహదారిపై డివైడర్ నిర్మాణం కూడా సక్రమంగా జరగలేదు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికితోడు నిబంధనలు అతిక్రమించి చేస్తున్న రాంగ్ రూట్ ప్రయాణాలు అమాయకుల ప్రాణాలు తీస్తున్నాయి. ముఖ్యంగా మధ్య లైన్లో బస్సులు, అంబులెన్స్‌లు కాకుండా అనుమతి లేని ఇతర వాహనాలు ప్రయాణించడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు లెక్కలు చెప్తున్నాయి. సర్వీస్ రోడ్ల పేరిట మధ్య రోడ్డు మినహా మిగిలిన రెండు లైన్లలో అటూఇటుగా ఒకేసారి వాహనాలు రాకపోలు సాగించడం కూడా ట్రాఫిక్ ఇక్కట్లకు, తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.



ప్రయాణికులకు అవగాహన కలిగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పూర్తిస్థాయి నియంత్రణ ఏదీ?

వాస్తవానికి బీఆర్‌టీఎస్ రహదారి మధ్యమార్గంలో ఆర్టీసీ బస్సులతో పాటు అత్యవసర సర్వీస్ వాహనాలు మాత్రమే రాకపోకలు సాగించాలి. కానీ పెందుర్తి కారిడార్‌పై ఆ నిబంధనలకు ఎప్పుడో నీళ్లొదిలేశారు. కుడి, ఎడమ లైన్లు తాత్కాలిక ఆక్రమణకు గురికావడంతో.. మధ్య లైన్లో అయితే వేగంగా వెళ్లిపోవచ్చన్న ఆలోచనతో వాహనదారులు ఆ రోడ్డునే ఎంచుకుంటున్నారు. ఇదే సమయంలో ఆర్టీసీ బస్‌లు వేగ నియంత్రణ లేకుండా జోరు కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో మధ్య రోడ్డులో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాల నియంత్రణకు పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కఠినంగా వ్యవహరిస్తున్నాం



ఒక్క బీఆర్‌టీఎస్ అనే కాదు అన్ని రహదారులపై నిబంధనలు అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. బీఆర్‌టీఎస్ వినియోగంపై ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. రాంగ్ రూట్ ప్రయాణాల నిరోధానికి భారీగా జరిమానాలు విధిస్తున్నాం. ముఖ్యంగా మధ్య రోడ్డులో ప్రయాణాల్ని నియంత్రిస్తున్నాం. అందుకే ఇటీవల కాలంలో ప్రమాదాలు తగ్గాయి. ప్రజలు కూడా అవగాహనతో వాహనాలు నడపాలి.

– నరసింగరాజు, ట్రాఫిక్ సీఐ, పెందుర్తి

టెన్త్ హిందీ పరీక్ష ప్రశాంతం

సబ్బవరం: మండలంలో జరుగుతున్న రెండో రోజు పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రెండో రోజు బుధవారం నిర్వహించిన హిందీ పరీక్షకు మొత్తం 925 మంది విద్యార్థులకు గాను 923 మంది హాజరైనట్లు ఎంఈవో లక్ష్మణరావు తెలిపారు. వీరిలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 185 మంది, ప్రతిభా విద్యాలయంలో 239 మంది, మదర్ పబ్లిక్ స్కూల్‌లో 235 మందికి గాను 233 మంది, సన్‌రిడ్జ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో 143 మంది విద్యార్థులు, రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్లో 121 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఆరుగురికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.60 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. విజయనగరం జిల్లా తెర్లాం ప్రాంతానికి చెందిన అల్లబోయిన గంగరాజు అనే వ్యక్తికి జరిమానా చెల్లించని కారణంగా నాలుగు రోజుల జైలు శిక్ష పడినట్లు వివరించారు. బుధవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా, జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సైకిల్‌యాత్రకు ఘన స్వాగతం



సీఐఎస్‌ఎఫ్ సైకిల్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న మాజీ సైనికోద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: సీఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 6550 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టిన సీఐఎస్‌ఎఫ్ జవాన్లు, అధికారుల బృందానికి అగనంపూడి వద్ద ఘన స్వాగతం లభించింది. అగనంపూడి ప్రాంతానికి చెందిన శ్రీపైడిమాంబ మాజీ సైనిక ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్రకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఆహార పొట్లాలు, శీతల పానీయాలు అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఐఎస్‌ఎఫ్ స్థాపించి 56 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సైకిల్ యాత్ర చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ యాత్ర నిరాటంకంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ నిర్వాసిత సంఘం నాయకులు కర్రి దశేంద్ర, మాజీ సైనికోద్యోగుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో 'ఉపాధి' కేటాయింపులు పెంచాలి



పని ప్రదేశంలో ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గొర్లివానిపాలెం వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీలతో బుధవారం సమావేశమయ్యారు. అనంతరం ఉపాధి పథకం పనులకు కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి కూలీలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ కుటుంబానికి 200 పని దినాలు కల్పించి, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలన్నారు. చేసిన పనులకు కూలి డబ్బులు చెల్లించని కారణంగా కూలీలు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా బడ్జెట్ నిధుల్లో కోత విధించి మెటీరియల్ చార్జీలు పెంచేశారని ఆరోపించారు. ముందు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి తర్వాత కూలీలకు చెల్లిస్తున్నారన్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో 40 శాతం సమ్మర్ అలవెన్స్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. తట్టా, పార, గునపాం వంటి సామగ్రిని సరఫరా చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కూలీలు ఐక్యంగా పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలిరెడ్డి అప్పారావు, ఎ.వరలక్ష్మి, మణి, పార్వతి, ఉమ, అప్పలనరసింహం, నాగమణి పాల్గొన్నారు.

మేహాద్రిలో ఆకాశ విహంగాల సందడి



పెందుర్తి: మండు వేసవి ముంచుకొచ్చేసింది. ఇలాంటి సమయంలో ఆకాశ విహంగాలైన పక్షులకు ఆశ్రయమిచ్చేవి జలాశయాలే. నగర పరిధిలో చేతి వేళ్లపై లెక్కపెట్టే స్థాయిలో కూడా జలాశయాల్లేవు. ఉన్న జలాశయాల్లో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ప్రస్తుతం నీటితో కళకళలాడుతోంది. దీంతో ఎక్కడెక్కడి నుంచో పక్షులు జలాశయం వద్దకు చేరి సందడి చేస్తున్నాయి. బాతులు ఈత కొడుతున్నాయి. ఎత్తైన గుట్టలు, నాచుతో కూడిన మొక్కలున్న చోట కొంగలు చేరి ఆహారాన్వేషణలో బిజీగా ఉంటున్నాయి. ఈ దృశ్యాలు జలాశయ సందర్శకులకు ఆనందాన్ని పంచుతున్నాయి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

జాతీయ విలువిద్య పోటీలకు విశాఖ జట్టు



గుంటూరులోని ఆర్చరీ క్రీడా ప్రాంగణం

పరవాడ: గుంటూరు జిల్లాలో ఈ నెల 20 నుంచి 29 వరకు నిర్వహించే జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు విశాఖ జట్టు ఎంపికైందని ఉమ్మడి విశాఖ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి నిశాంత్ తెలిపారు. ఎన్టీపీసీ చెరుకూరి లెనిన్ ఓల్గా మెమోరియల్ 14వ మినీ(అండర్–15), 6వ కిడ్స్(అండర్–10) ఓపెన్, 1వ కిడ్స్(అండర్–13) ఓపెన్ ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌నకు ఏపీ జట్టు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో అండర్–15 ఇండియన్ రౌండ్‌లో సోదేరామ్ చైతన్య, సాయి మనస్వి కనకళ, అండర్–13 ఇండియన్ రౌండ్‌లో వంతల లలిత్ సాయితేజ, నల్లి తేజేశ్వరరావు, కిల్లో చోద్య సంధిత, అండర్–13 కాంపౌండ్ గర్ల్స్‌లో ఊడి యశస్వి, ఆద్య వేమూరి, అండర్ 13 రికర్వ్ గర్ల్స్‌లో శనివాడ తన్మయశ్రీలు పోటీపడి, రాణించాలని అసోసియేషన్ అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, కోశాధికారి పి.భాస్కర్, కోచ్‌లు శివకుమార్, గోవిందులు ఆకాంక్షించారు.

ఆక్రమణ చెర నుంచి స్టీల్‌ప్లాంట్ భూమికి విముక్తి



స్టీల్‌ప్లాంట్ భూమిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు



ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన క్రికెట్ అకాడమీ బోర్డు

- కబ్జాదారుల చేతుల్లో సుమారు 90 సెంట్ల భూమి
- అందులో క్రికెట్ అకాడమీ ఏర్పాటు
- కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు
- స్పందించిన స్టీల్‌ప్లాంట్ అధికారులు
- భూమిని స్వాధీనం చేసుకుని మొక్కలు నాటిన వైనం

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ అధికారులు స్పందించారు.. కబ్జాదారుల చేతుల్లో చిక్కుకున్న సుమారు 90 సెంట్లు భూమికి విముక్తి కల్పించారు. అందులో అక్రమంగా నిర్మించిన క్రికెట్ అకాడమీ కట్టడాలను తొలగించారు. ఆపై అందులో మొక్కలు నాటారు. ఈ భూ ఆక్రమణకు సంబంధించి వివరాల ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట సమీపంలోని నడుపూరు గ్రామం సర్వే నెంబర్ 232లో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూమి ఉంది. ఆ స్థలాన్ని ఓ వ్యక్తి ఇటీవల ఆక్రమించాడు. ఆ భూమిలో ఉన్న లక్షలాది రూపాయల విలువైన చెట్లను నరికించేశాడు. భూమిని చక్కగా చదును చేయించాడు. ఆ స్థలాన్ని క్రీడామైదానంగా తీర్చిదిద్దాడు. అందులో క్రికెట్ అకాడమీ నెలకొల్పాడు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న తతంగంపై స్థానికులు పెద్ద ఎత్తున స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో స్పందించిన స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులు ఆ భూమిని పరిశీలించారు. సర్వే చేసి ఆ భూమి స్టీల్‌ప్లాంట్‌కు చెందినదిగా నిర్ధారించుకున్నారు. తర్వాత అక్కడ సర్వే రాళ్లు పాతించారు. ఆపై అక్కడ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ అధికారులు బాలరాజు, వెంకటేష్, మంత్రి నర్సింహమూర్తి, భాస్కర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మళ్లీ ఈ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సర్వేయర్లు, పెదగంట్యాడ మండల రెవెన్యూ సర్వేయర్లు, దువ్వాడ పోలీసులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి విద్యను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఐ నాగేశ్వరరావు

అగనంపూడి: ప్రపంచ స్థాయి విద్య, పరిజ్ఞానం పొందినప్పుడే మంచి అవకాశాలు లభిస్తాయని ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ డి.నాగేశ్వరరావు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు విదేశీ విద్యావకాశాలు, స్కాలర్‌షిప్‌లు, వివిధ కోర్సులపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత తరుణంలో విదేశాల్లో చదువులతోపాటు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. భారతీయ యువతకు మంచి గిరాకీ ఉందని చెప్పారు. విద్యార్థులు వాటిని అందుకునే దిశగా ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, ఎంబీఏ ప్రొఫెసర్ ఎస్.ఎం.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే మెరుగైన విద్యాబోధన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

సబ్బవరం: ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన జరుగుతుందని మండలంలోని రాయపుర అగ్రహారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బి.వెంకటరెడ్డి అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మెహర్‌శాంతి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో వారి పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని బుధవారం ప్రచారం చేశారు. ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్న కొందరు తల్లిదండ్రులతో మాట్లాడుతూ తమపై నమ్మకంతో పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తే మెరుగైన విద్యను అందించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాలకు దూరంగా ఉన్న పిల్లల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటే ఆటోలను కూడా ఏర్పాటు చేస్తామని భరోసానిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ప్రభుత్వం నుంచి పాఠశాల ద్వారా అందే అన్ని రకాల సేవలను, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ క్యాంపెయిన్‌లో ఉపాధ్యాయులు టి.విశ్వేశ్వరవర్మ, కాకర సూర్యకుమారితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కొలువులకు 78 మంది ఎంపిక



నియామక పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సంస్థ ప్రతినిధులు

పెదగంట్యాడ: యువతకు ఉపాధి కల్పించేందుకు నాలుగు ఎంఎన్‌సీ కంపెనీలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వికాస్‌నగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు సుమారు 141 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వీల్స్ ఇండియా లిమిటెడ్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా కంపెనీలకు అవసరమైన 78 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.10వేల744 నుంచి రూ.27వేల వరకూ జీతం ఇవ్వనున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు.